క్లుప్తంగా

మోదీ, అమిత్‌షా రాజీనామా చేయాలి



గాంధీ విగ్రహం ఎదుట ఆందోళన దృశ్యం

కర్నూలు(సెంట్రల్) :మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న హింసాకాండకు బాధ్యులుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి నరేంద్రమోదీ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనపై సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘాల నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజన మహిళలను అత్యాచారం చేసి చంపి వేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. తక్షణమే మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు, లాంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కైలాష్ నాయక్, నాయకులు ఎక్బాల్, ఇనాయతుల్లా పాల్గొన్నారు

విద్యార్థుల అదృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని ఖండేరికి చెందిన సాయి మణిదీప్, శివప్రసాద్ అనే ఇద్దరు విద్యార్థులు అదృశ్యమయ్యారు. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదవుతున్న వీరు సోమవారం సాయంత్రం స్పెషల్ క్లాస్‌కు వెళ్లారు. తిరిగి రాత్రి ఇంటికి వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు కర్నూలు ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వర్షం కారణంగా ఎక్కడైనా తప్పిపోయారా? లేదా అదృశ్యమయ్యారా అనేది తెలియాల్సి ఉంది.

ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి ప్రమాదం

కర్నూలు (టౌన్) : ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి ప్రమాదమని నగర పాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ అన్నారు. నగరంలోని 48 వ వార్డులో 124 సచివాలయం వలంటీర్ సుమలత ఆధ్వర్యంలో ప్లాస్టిక్ రహిత బ్యాగుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ మానవ మనుగడకు ముప్పుగా తయారయ్యే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ రహిత బ్యాగులు వాడాలని పిలుపు నిచ్చారు.

ఏపీ సెట్‌కు నోటిఫికేషన్ ఇవ్వండి

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ ఎలిజిబులిటీ టెస్ట్‌కు (ఏపీ సెట్) నోటిఫికేషన్ ఇవ్వాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ చంద్రప్ప, ఏపీ ప్రైవేటు లెక్చరర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సల్కాపురం అమృతకుమార్ కోరారు. సోమవారం వారు స్థానిక ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో భర్తీ చేయనున్న అసిస్టెంట్ ప్రొఫెసర్, డిగ్రీ లెక్చరర్ల పోస్టుల భర్తీలో ఏపీ సెట్ అర్హత ఉండాలని యూజీసీ నిర్ణయించిందన్నారు. అయితే, రెండేళ్లుగా ఏపీ సెట్ నిర్వహించకపోవడం వల్ల ఎంతో మంది నిరుద్యోగులు ఆశతో ఉన్నారన్నారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఇదే అంశంపై జిల్లాలోని ప్రజా ప్రతినిధులందరిని కలిసి వినతి పత్రాలు అందిస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కల్లూరు: 44వ జాతీయ రహదారిపై పెద్దటేకూరు సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. తడకనపల్లె గ్రామానికి చెందిన వడ్డె నాగన్న(67) ఆటోలో కర్నూలు నుంచి సొంత గ్రామానికి వస్తుండగా 44వ జాతీయ రహదారి పెద్దటేకూరు సమీపంలో వెనక వైపు నుంచి స్కూటీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వడ్డె నాగన్నకు, ద్విచక్ర వాహదారుడు రామారావుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైవే పెట్రోలింగ్-1 వాహనంలో హెడ్ కానిస్టేబుల్ ఎం.నూర్ అహమ్మద్ కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిచారు. ఘటనపై ఉలిందకొండ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శివాజీ విగ్రహం ఏర్పాటుకు అనుమతివ్వాలి



ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): బళ్లారి చౌరస్తా పరిసరాల్లో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల డిమాండ్ చేశారు. సోమవారం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుతం వై జంక్షన్‌గా పిలువబడుతున్న మార్గానికి శివాజీ పేరు పెట్టాలన్నారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు గోవిదరాజులు, ఈపూర్తి నాగరాజు, శేఖర్, మధు పాల్గొన్నారు.

సంతాన ప్రాప్తిరస్తు !

- పెరుగుతున్న సంతానలేమి సమస్యలు
- జీవనశైలి మార్పులే కారణం
- సంతాన సాఫల్య కేంద్రాలకు పరుగులు
- నేడు వరల్డ్ ఐవీఎఫ్ డే

పెళ్లైన ప్రతి మహిళ.. అమ్మా అని పిలిపించుకోవడానికి పరితపిస్తూ ఉంటుంది.. అలాగే పురుషుడు నాన్నా అనే పిలుపు కోసం ఎదురుచూస్తూ ఉంటాడు. అయితే, కొందరు పెళ్లై చాలా కాలం అయినా.. పిల్లలు పుట్టక ఇబ్బంది పడుతూ ఉంటారు. అదే పూర్వం ఇలాంటి వారు తమకు జీవితంలో తల్లిదండ్రులయ్యే యోగం లేదని సరిపెట్టుకునేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. కృత్రిమంగా గర్భధారణ చేసే వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయి. 1978 జూలై 25న ఇంగ్లండ్‌లో ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్(ఐవీఎఫ్) అనే కృత్రిమ గర్భధారణ పద్ధతిలో జన్మించిన మొదటి బిడ్డ లూయిస్ బ్రౌన్ అయ్యారు. ఈ విజయానికి గుర్తుగా ప్రతి ఏడాది జూలై 25న ప్రపంచ ఎంబ్రియాలజిస్టు డేగా జరుపుకుంటారు. ఇదే ఐవీఎఫ్ డేగా కూడా ప్రాచుర్యం పొందింది.



కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ఇటీవల సంతానలేమి సమస్యలతో బాధపడే వారి సంఖ్య అధికమైంది. గతంలో వంద మందిలో ఏ ఇద్దరు, ముగ్గురికి మాత్రమే ఈ సమస్య ఉండేది. ఇప్పుడు 16 నుంచి 18 శాతం మందిలో ఈ సమస్య వేధిస్తోంది. ఇందులో కొందరు వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకుంటుండగా మరికొందరు వైద్యుల వద్దకు వెళ్లేందుకు జంకుతున్నారు. ప్రస్తుతం సంతానం కలిగేందుకు ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. ఒకప్పుడు సంతానం కోసం హైదరాబాద్, చెన్నై, బెంగళూరులలోని ఫెర్టిలిటి కేంద్రాల(సంతాన సాఫల్య కేంద్రాలు)ను ఆశ్రయించేవారు. ఇప్పుడు కర్నూలులోనే ఈ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. ఒక్క కర్నూలు నగరంలోనే పదిదాకా ఈ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలకు ప్రస్తుతం ప్రతిరోజూ 30 నుంచి 40 మంది దాకా నూతన పేషంట్లు చికిత్స కోసం వస్తున్నారు. ఫెర్టిలిటి కేంద్రాలతో పాటు పలువురు సీనియర్, నిపుణులైన గైనకాలజిస్టులు సైతం సంతానం కలిగించే దిశలో చికిత్సలు చేస్తున్నారు. కాగా ప్రస్తుతం ఐవీఎఫ్ చికిత్సా విధానం బాగా ప్రాచుర్యం పొందింది.

సంతానలేమికి కారణాలు

ఆలస్యంగా వివాహం చేసుకోవడం, మారిన జీవన శైలి, వ్యాయామం లేకపోవడం, స్థూలకాయం, పీసీఓఎస్ సమస్యలు, రాత్రివేళల్లో ఆలస్యంగా నిద్రపోవడం, జంక్‌ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం, మొబైల్‌ఫోన్ స్క్రీన్ ఎక్కువగా చూడటం వల్ల, అన్యోన్య దాంపత్యం లేకపోవడం తదితరవి సంతానలేమికి కారణాలు.

ఐవీఎఫ్ అంటే

ఐవీఎఫ్ అంటే చాలా మందికి అర్థం తెలియదు. సంతానం లేని వారు చాలా మంది సంతాన సాఫల్య కేంద్రాలకు వెళ్తున్నారు. కానీ అక్కడ చేసే ఐవీఎఫ్ పద్ధతి గురించి వారికి సరైన అవగాహన ఉండదు. ఈ పద్ధతిలో బిడ్డను కనాలనుకునే దంపతులు ముందుగా దాని గురించి పూర్తిగా అవగాహన చేసుకోవాలి. అప్పుడే భవిష్యత్‌లో వారి మధ్య అపోహలు తలెత్తకుండా ఉంటాయి. సాధారణంగా స్త్రీ కడుపులో బిడ్డ జన్మించాలంటే మగవారి వీర్యకణాలు ఆడవారి అండంతో కలవాలి. అప్పుడు అది పిండంగా రూపాంతరం చెందుతుంది. ఈ విషయంలో ఇబ్బందులు ఉన్నప్పుడు ఐవీఎఫ్ విధానంలో ల్యాబ్‌లో అండకణాలను సంగ్రహించడం చేసి స్పెర్మ్ నమూనాను మెరుగుపరుస్తారు. ఇంకా వివరంగా చెప్పాలంటే... ఆడవారి నుంచి అండకణాలను, మగవారి నుంచి వీర్యకణాలను సేకరించి వాటిని ల్యాబ్‌లో ఫలదీకరణ చేయడం అన్నమాట.

ఐవీఎఫ్ ఎప్పుడు అవసరమవుతుందంటే...

చాలా మంది మాకు సంతానం కలగడం లేదని ఐవీఎఫ్ చేయాలని వైద్యులను కోరుతుంటారు. కానీ సంతానం కలగని వారందరికీ ఐవీఎఫ్ అవసరం లేదు. ముందుగా వైద్యులను సంప్రదించి సమస్యలను వివరించాలి. సంతానం కలగకపోవడానికి అసలు సమస్య ఏమిటో వారు గుర్తిస్తారు. దీన్ని బట్టి ముందుగా సహజసిద్ధంగా గర్భం ధరించేలా తగిన చికిత్స, ఔషధాలు అందిస్తారు. సహజ సిద్ధంగా గర్భధారణ కలిగేందుకు అవకాశం లేకుండా ఉన్న వారికి మాత్రమే ఐవీఎఫ్ చికిత్స ప్రారంభిస్తారు. ముఖ్యంగా ఆడవారిలో ఫెలోపియన్ నాళాలు మూసుకుపోయినప్పుడు, అండకణాలు తక్కువగా ఉన్నప్పుడు, అండాశయ ట్యూబ్స్ బ్లాక్ అయినప్పుడు, ఎగ్ కౌంట్ తక్కువగా ఉన్నప్పుడు, ఐయూఐ చికిత్స విఫలమైనప్పుడు, ఎక్కువసార్లు అబార్షన్లు అయినవారికి, క్యాన్సర్ రోగులకు, అలాగే మగవారిలో స్పెర్మ్ నాణ్యత తక్కువగా లేదా పూర్తిగా లేనప్పుడు ఐవీఎఫ్ అవసరమవుతుంది.

ఐవీఎఫ్‌పై ఎలాంటి భయమూ వద్దు



మొదటి ఐవీఎఫ్ శిశువు జన్మించి 45 ఏళ్లు అయింది. అయినా ఇప్పటికీ చాలా మందికి ఐవీఎఫ్ అంటే ఒక తెలియని భయం. సాధారణంగా మహిళకు 30 ఏళ్లు దాటిన తర్వాత సంతానోత్ప త్తి సామర్థ్యం తగ్గుతుంది. ఐవీఎఫ్ పద్ధతి ద్వారా జిల్లాలోనూ చాలా మంది సంతానం కన్నారు. వారంతా ఎంతో హాయిగా జీవిస్తున్నారు. సంతానం కలిగేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేసి విఫలమైనప్పుడు మాత్రమే ఐవీఎఫ్ మార్గా న్ని సూచిస్తాము. ఐవీఎఫ్‌లో ఎన్నో ఆధునిక పద్ధతులు, మందులు ఇప్పుడు వచ్చాయి. కాబట్టి సంతానం కోసం ఎదురుచూడటం గతంలో మాదిరిగా ఇప్పుడు అవసరం లేదు.

–డాక్టర్ పి. విష్ణుప్రియ, ఇన్‌ఫెర్టిలిటి స్పెషలిస్టు, కర్నూలు

సైడ్‌ఎఫెక్ట్స్ ఉండవు



1978లో మొదటిసారి ఐవీఎఫ్ ద్వారా జన్మించిన లూయిస్ బ్రౌన్ అనే మహిళకు ప్రస్తుతం నలుగురు సంతానం. ఆమె ఎంతో హాయిగా సంసార జీవితాన్ని సాగిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ విధానం ద్వారా ఇప్పటి వరకు 8 మిలియన్ల మంది జన్మించారు. అయితే ఐవీఎఫ్ పట్ల ఇప్పటికీ చాలా మందికి అపోహలు ఉన్నాయి. ఐవీఎఫ్‌లోనూ ఐసీఎస్ఐ, ఐవీఎం, ఎగ్‌ఫ్రీజింగ్, స్పెర్మ్ ఫ్రీజింగ్, ఫెర్టిలిటి ప్రిజర్వేషన్, ప్రీ ఇంప్లాంటేషన్, జనటిక్ టెస్ట్ అనే అడ్వాన్స్ టెక్నాలజి అందుబాటులోకి వచ్చాయి. ఐవీఎఫ్‌లో ఇచ్చే మందులతోనూ ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు.

–డాక్టర్ డి. విజయలక్ష్మి, ఇన్‌ఫెర్టిలిటి స్పెషలిస్టు, కర్నూలు

కేడీసీసీబీ అభివృద్ధికి పూర్తి సహకారం

- కర్నూలు డీసీసీబీ చైర్ పర్సన్ విజయ మనోహరికి ఆప్కాబ్ ఎండీ హామీ

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకారం కేంద్ర బ్యాంక్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనాథరెడ్డి ఆ బ్యాంక్ ఉమ్మడి కర్నూలు జిల్లా చైర్‌పర్సన్‌ఎస్వీ విజయ మనోహరికి హామీ ఇచ్చారు. కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్‌గా నియమితులైన నేపథ్యంలో ఆమె డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.రామంజనేయులుతో కలసి ఆప్కాబ్ ఎండీతో విజయవాడలో సమావేశమయ్యారు. ఆప్కాబ్ ఎండీకి మర్యాదపూర్వకంగా బొకే సమర్పించారు. ఈ సందర్భంగా కేడీసీసీ చైర్ పర్సన్ విజయమనోహరి బ్యాంకు పరిస్థితిని ఆయనకు వివరించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా డీసీసీబీతో పాటు పీఏసీఎస్‌లన్నింటినీ మరింత అభివృద్ధి చేసేందుకు ఆప్కాబ్ నుంచి తగిన సహకారం కావాలని కోరారు. రైతుల అభ్యున్నతికి తీసుకునే చర్యలన్నింటికి సంపూర్ణ సహకారం అందజేస్తామని, రుణాల పంపిణీకి బడ్జెట్ ఎంతైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఎండీ శ్రీనాథరెడ్డి చైర్‌పర్సన్‌కు హామీ ఇచ్చారు.



ఆప్కాబ్ ఎండీకి బొకే అందజేస్తున్న కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి, చిత్రంలో సీఈవో రామాంజనేయులు

విద్యార్థుల వివరాలు చైల్డ్ ఇన్ఫోలో అప్‌డేట్ చేయాలి

- ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- అధికారులతో సమీక్షలో జిల్లా కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలను తప్పనిసరిగా చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన యాజమాన్యాలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వివిధ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బడి బయట ఉండే విద్యార్థులను గుర్తించే పనిలో వలంటీర్లు తప్పుడు వివరాలు నమోదు చేయరాదన్నారు. అలా ఎవరైనా చేస్తే వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓలు,మునిసిపల్ కమిషనర్లను ఆమె ఆదేశించారు. ప్రభుత్వపాఠశాలల్లో చదివే విద్యార్థుల వివరాలను కూడా ప్రధానోపాధ్యాయులు చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేయాలన్నారు. ఎమ్మిగనూరు, ఆదోని మండలాల్లో విద్యార్థుల డేటాను నమోదు చేయని ప్రైవేట్ పాఠశాలకు నోటీషులు జారీ చేయా లని సంబంధిత మండలాల అధికారులను ఆదేశించారు. జగనన్న సురక్షకు సంబంధించి జిల్లాలో కృష్ణగిరి మండలంలో అత్యంత తక్కువ సర్వీసులను జనరేట్ చేశారని, పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో వెల్దుర్తి, కర్నూలు అర్బన్, గోనెగండ్ల, మండలాల్లో తక్కువ పురోగతి ఉందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణ పనుల్లో వేగం పెరగాలన్నారు. గోనెగండ్ల , తుగ్గలి, కోసిగి మండలాల్లో పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదన్నారు. స్వామిత్వ ఈకేవైసీకి సంబంధించి వీఆర్వో లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న వాటిని త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ.. సీసీఆర్సీ కార్డులను త్వరగా అర్హులైన రైతులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ, రెవెన్యూ శాఖలను ఆదేశించారు.

నిధుల మళ్లింపు అన్యాయం

కర్నూలు(సెంట్రల్): బకాయిల పేరుతో గ్రామ సర్పంచ్‌ల ఖాతాల్లో జమైన 14,15వ ఆర్థిక సంఘం నిధులను ఇతర పనులకు మళ్లించడం అన్యాయమని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సర్పంచ్‌లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల 14, 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం సర్పంచ్‌ల ఖాతాల్లో జమ చేసిందన్నారు. అయితే పడిన వెంటనే విద్యుత్ బకాయిల కోసం తమ అనుమతి లేకుండా దారి మళ్లించారన్నారు. దీంతో గ్రామ పంచాయతీల్లో చిన్న చిన్న పనులను చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వై.రామచంద్రుడు, భూమా వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీమేధలో ఘనంగా ఫ్రెషర్స్ డే

కర్నూలు సిటీ: కొత్త బస్టాండ్ సమీపంలోని శ్రీమేధ జూనియర్ కాలేజీలో సోమవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ కె.రాము మాట్లాడుతూ విద్యార్థులు చక్కని ప్రణాళికతో చదువుకోవాలన్నారు. అప్పుడే లక్ష్యాన్ని చేరుకోగలుగుతారన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆ తరువాత ఇంటర్‌లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

మూడు ఎకరాలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి మూడు ఎకరాల పొలం ఇవ్వాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆక్రమణకు గురైన సర్వీసు ఇనాం భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. సర్వీసు ఇనాం భూములకు ప్రభుత్వం యాజమాన్య హక్కులు ఇవ్వడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో ఎంతో మంది పేదలకు కనీసం ఎకరం భూమి లేదని, అలాంటి వారిని గుర్తించి న్యాయం చేయాలన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కర్నూలు(రాజ్‌విహార్): ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు మంగళవారం డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రోడ్డు రవాణా సంస్థ కర్నూలు-2 డిపో మేనేజరు సర్దార్ హుసేన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ రూట్ల పరిధిలో రాకపోకలు సాగించే ప్రయాణికులు దయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య 99592 25794 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయవచ్చునని పేర్కొన్నారు.

విశ్వవిద్యాలయాల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

కర్నూలు (న్యూసిటీ): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేయాలని టీఎన్ఎస్ఎఫ్ కర్నూలు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి బొగ్గుల ప్రవీణ్ ప్రభుత్వాన్ని కోరారు. నాలుగేళ్ల డిగ్రీ హానర్స్ కోర్సును రద్దు చేసి మూడేళ్ల డిగ్రీని కొనసాగించాలని రాయలసీమ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య బాయినేని శ్రీనివాసులుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రీ, పీజీ పీహెచ్‌డీ విద్యార్థుల స్కాలర్‌షిప్, మెస్ చార్జీలను పెంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాంప్రకాష్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే పాలన



వృద్ధురాలికి ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- 30వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమం
- లబ్ధిదారులకు ధ్రువ పత్రాల పంపిణీ

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల చెంతకే పాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 30వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే హాజరై లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులై ఉండి సంక్షేమ పథకాలు దక్కని వారిని గుర్తించి అందించాలనే ఉద్దేశంతోనే తమ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమం తీసుకువచ్చిందన్నారు. ఆయా వార్డుల్లో జరుగుతున్న సురక్ష క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లబ్ధిదారులకు వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. జల్లెడ పట్టి అందరికి సమక్షేమ పథకాలు ఫలాలు అందించేల చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె.జయరాముడు, మున్సిపల్ అధికారులు గోపాల్ కృష్ణ, క్రిష్టఫర్, వైఎస్సార్‌సీపీ నాయకులు శివారెడ్డి, తిరుమలేష్ గౌడ్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

511 లీటర్ల పాలతో అభిషేకం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి సోమవారం 511లీటర్లతో పాలాభిషేకం చేశారు. ఈఓ రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన వేణుగోపాల్, రమాదేవి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి 511 లీటర్ల పాలతో అభిషేకం చేశారన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు నారాయణ, కృష్ణయ్య, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

సురక్షను సద్వినియోగం చేసుకోండి

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందని అర్హులకు ఈ కార్యక్రమం ద్వారా న్యాయం చేస్తున్నట్లు చెప్పారు. సోమవారం కర్నూలు మండలం ఉల్చాల, సుంకేసుల గ్రామాల్లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ పాలనలో సమూల మార్పులు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. సురక్ష కార్యక్రమంతో ప్రజా సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కారం చేస్తున్నామని చెప్పారు. 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. సుంకేసులలో 400, ఉల్చాలలో 407 మందికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ ధర్మవరం వెంకటేశ్వరమ్మ, డీటీ సహెరాబాను, ఉల్చాల గ్రామ సర్పంచ్ విద్యాసాగర్, మండల మాజీ ఉపాధ్యక్షుడు వాసు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ వంశీకృష్ణారెడ్డి, సచివాలయ కన్వీనర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, మద్దిలేటి, చిన్న లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.



ఉల్చాలలో మహిళకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

అర్హుల ఇంటికి సంక్షేమ ఫలాలు



మహిళకు సంక్షేమ పథకాల గురించి తెలియజేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హుల ఇంటికి సంక్షేమ ఫలాలు అందజేస్తుందని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలిచారని చెప్పారు. సోమవారం ఆయన స్థానిక 11వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఖడక్‌పురా వీధుల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కులమతాలు, పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. అవినీతికి తావు లేకుండా నేరుగా అర్హుల బ్యాంక్ ఖాతాల్లో నగదును జమ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఫరాజ్‌ఖాన్, పార్టీ నాయకులు ఫైజల్‌ఖాన్, నూరుల్లా ఖాద్రీ, జుబేర్, షబ్బీర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెస్ట్ ఇంజనీరింగ్ కాలేజీగా రవీంద్రకు అవార్డు



అవార్డు అందుకుంటున్న రవీంద్ర విద్యా సంస్థల చైర్మన్

కర్నూలు సిటీ: రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కాలేజీకి మరో అరుదైన అవార్డు లభించినట్లు ప్రిన్సిపాల్ డా.కేఈ శ్రీనివాసమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవలే ఉత్తమ శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించినందుకు లింక్డ్ ఇన్ సంస్థ లీడర్స్ కాన్‌క్లేవ్ అవార్డును ప్రదానం చేసింది. తాజాగా ఇండియన్ ఐకాన్ అనే సంస్థ రవీంద్రకు ఉత్తమ ఇంజినీరింగ్ కాలేజీ అవార్డు ప్రకటించింది. ఆ విద్యా సంస్థల చైర్మన్ జీవీఎం మోహన్‌కుమార్ న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పుదుచ్చేరి మాజీ గవర్నర్ కిరణ్‌బేడి చేతుల మీదుగా అందుకున్నారు. మొట్ట మొదటి మహిళ ఐపీఎస్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆ కాలేజీ చైర్మన్ జీవీఎం మోహన్‌కుమార్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చండి

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని గొందిపర్ల గ్రామంలోని ఇందిరమ్మ, సుందరయ్యనగర్ సమీపంలో రోడ్డుపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు వెంకటరాముడు, సీపీఎం మండల కార్యదర్శి ఉసేనయ్య కోరారు. సోమవారం ఎలక్ట్రికల్ డీఈ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రోడ్డుకు అడ్డంగా ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ఆర్టీసీ బస్సు తిరగడం లేదని, ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చితే బస్సు నడుపుతామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి



స్పందనలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): నగరశివారులోని జగన్నాథగట్టు హౌసింగ్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని పింజరి సుభాన్ బాషా అభ్యర్థించారు. సోమవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతులు స్వీకరించిన వారిలో టౌన్ ప్లానింగ్ ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్ కుమార్, మున్సిపల్ ఎస్ఈ వేణుగోపాల్, మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ నాగరాజు, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

బెంచీల విరాళం

కర్నూలు (న్యూటౌన్): దివంగత మాజీ ఎమ్మెల్యే శిఖామణి 15వ వర్ధంతి సందర్భంగా ఆయన పెద్దకుమారుడు మణిబాబు కర్నూలు నగర శివారులోని 38వ వార్డు మునగాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 60 బెంచీలను విరాళంగా అందజేశారు. సోమవారం 60 బెంచీలతో పాటు పాఠశాల ఖర్చుల నిమిత్తం రూ.5వేల నగదును అందజేశారు. ఈ నెల 25వ తేదీన తన తండ్రి శిఖామణి వర్ధంతిని పురస్కరించుకుని మహిళలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే 26న అన్నదానం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.